కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# రైలు ప్రయాణం

కుందుర్తి ఇందిరాదేవి, బి.కాం., (తృతీయ)
యస్. కె. అర్. బి. అర్. కాలేజి, నర్సరావుపేట.

రైలు సంధించిన బాణంలా వెడుతోంది. రివ్వున వీస్తున్న గాలి ఒంటిని తాకి చక్కిలిగింతలు పెడుతోంది.

సెలయేరు రాళ్ళు రప్పలు దాటుకుంటూ వేగంగా సంగీతం తీస్తున్నట్టుగా ప్రవహిస్తుంటే, యేటిఒడ్డున కూర్చున్న వారికి తన్మయత్వంతో ఒక అద్భుతమయిన దృశ్యాన్ని చూస్తున్నట్టు, వీనులవిందయిన సంగీతాన్ని వింటున్నట్టు అనిపిస్తుంది. అలాగే రైలు ప్రయాణంలో, కిటికీ పక్కనే కూర్చుంటే, రివ్వున వెడుతున్న రైల్లోంచి హరితవర్ణంలో వున్న పొలాలు, ఆకాశమంటుతున్నట్టుండే వృక్షరాజాలు, దట్టమయిన పొదలు, రాళ్ళు, తుప్పలతో కూడినటువంటి ప్రదేశాలు, కొండలు కంటికింపుగా మనోహరంగా కనిపిస్తూ వుంటాయి.

ఇవన్నీ దాటుకుంటూ ప్రయాణిస్తున్న రైల్లో కిటికీ ప్రక్కగా కూర్చుని ప్రకృతి దృశ్యాలను తదేకంగా చూస్తున్న కమల పక్కకి తిరిగి చూసింది.

గుమ్మంలో తలుపుకి ఆనుకుని నిలబడి తననే చూస్తున్న అతన్ని చూడగానే కమల కళ్ళల్లో ఆనందం లాటిది తళుక్కుమని, అంతలోనే సిగ్గు దోబూచులాడింది.

పెళ్ళయి మూడు నిద్రలకు అత్తవారింటికి వెడుతున్న కమలకు తోడుగా చెల్లెలు జ్యోతి, వదిన సరళ వచ్చారు.

సరళ, కమల అత్తగారితో పెళ్ళిళ్ళ గురించి, ఫ్యాషన్ల గురించి చెబుతూ, మధ్య మధ్య తన కోరికలు వెళ్ళబోసుకుంటోంది.

చెల్లెలు జ్యోతి పెళ్ళికొడుకు చెల్లెలితో అప్పుడే స్నేహం కలిపేసి, తన స్కూలు కబుర్లు చెబుతూ, ఆ అమ్మాయితో గూడా వాళ్ళ స్కూలు కబుర్లు చెప్పిస్తూ ఆసక్తిగా వింటోంది.

అందరూ ఎవరి కబుర్లలో వాళ్ళుండబట్టే అతనంత సూటిగా తననే చూస్తున్నాడు. ఈ ఆలోచన రాగానే కమల సిగ్గుపడిపోయింది. అతన్నే ఎంచక్కా చూడాలని తనకూ అనిపిస్తోంది. అమ్మో! చూస్తే ఇంకేమైనా వుందా. కొత్తపెళ్ళికూతురు సిగ్గులేకుండా అప్పుడే భర్తని ఎలా చూస్తోందో చూడు! అని అందరూ అనుకోరూ!

ఇలా ఆలోచిస్తూ కమల మధ్య మధ్య అతన్ని దొంగచూపులు చూస్తూ కిటికీవైపు చూపులు తిప్పుకుంటోంది.

పాపం అతనెంతసేపు నిలబడతాడు? కాస్త అటువైపు సర్దుకుని కూర్చోగూడదూ! గంటన్నరనుండి అతనలా నిలబడే వున్నాడు. అటువయిపంతా పెట్టెలు, బుట్టలతో అసలు కాళ్ళు పెట్టటానికి వీల్లేకుండా వుంది.

కమల ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రైలు ఒక స్టేషన్‌లో ఆగింది. అతను క్రిందకు దిగాడు. కమల అతను వెళ్ళినవైపే చూడసాగింది. అతని పేరు ఆనంద్. ఎంత






చక్కనివాడు! అతన్ని చూసి పెళ్ళిలో తన స్నేహితులంతా ఎంత గోల చేశారు!

"హల్లో మిసెస్ కమలానంద్" అంటూ సరోజ ఎంత వుడికించింది!

మొదట అన్నగారు ఈ సంబంధం తెచ్చినప్పుడు తను ససేమిరా అంది. అంతకు ముందు ఇలా పెళ్ళి చూపులకు వచ్చే ప్రతివాడి ముందు కూర్చుని చిరాకెత్తిపోయిన తను అసలు పెళ్ళే చేసుకోనంది. వచ్చినవాళ్ళు, తను నచ్చలేదనో అమ్మాయి నచ్చితే కట్నం నచ్చలేదనో వంకపెట్టేవారు. అది నిజంగా ఎంత నరకం! కానీ వీళ్ళు వచ్చి చూడటం, తను నచ్చిందనటం, వెంటనే తాంబూలాలు పుచ్చుకోవటం, పెళ్ళి జరగటం టకటకా జరిగిపోయాయి. ఎంత చిత్రంగా వుంది? కమల మెళ్ళో మంగళసూత్రాలు తడుముకుంటూ తలెత్తి చూసింది.

అతను ఇంగ్లీష్ మాగజైన్స్, తెలుగు పత్రికలు కొంటున్నాడు. జ్యోతి, శారద కూడా దిగి అతనివైపు పరిగెత్తారు. అతను కాఫీ తాగుతూ ఇటే చూస్తూ ఏవో అంటున్నాడు. ఏమంటున్నాడు! కమల యోచించేలోపలే జ్యోతి కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది.

"అక్కా! బావగారు కాఫీ తాగమన్నారు" అంది.

కమల చప్పున కళ్ళెత్తి చూసింది. అతను 'తాగు' అన్నట్టు నవ్వాడు. కమల కాఫీతాగి తిరిగి కప్పు ఇచ్చేసింది. ట్రెయిన్ కదలటానికి సూచనగా గంటకొట్టారు. అందరూ ఎక్కారు. శారద పరుగెత్తుకొచ్చి పత్రికలు కమల చేతిలో పెట్టింది.

అరే రైలు కదులుతోంది అతను ఎక్కడేం! అమ్మో అతను ఎక్కకుండానే రైలు వెళ్ళిపోతే! అతన్ని చప్పున పిలవమని అత్తగారిని అడిగితే! పోనీ శారదతోనయినా చెప్తే! కమల శారదను పిలిచి చెప్పేలోగానే, అతను చేతిలో మరచెంబుతో కమ్మీ పట్టుకుని ఎక్కేశాడు.

అమ్మో జారిపడితాడేమో! కమల గుండెలు క్షణంసేపు కొట్టుకోవటం మానేశాయి. హమ్మయ్య ట్రెయిన్ ఎక్కేశాడు. కమల తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. అయినా ఇదేం మనిషి బాబూ! అంతలా పరిగెత్తి వచ్చిచెడీ ఎక్కకపోతే ఏమయింది? కొంచెం ముందుగా ఎక్కగూడదూ!

అతను మరచెంబు తల్లికిచ్చేసి మేనమామతో మాట్లాడుతూ మధ్య మధ్య నవ్వు

తున్నాడు. అబ్బా! అతను నిజంగా ఎంతం దంగా నవ్వుతాడు? నవ్వినప్పుడు కళ్ళు తమాషాగా చికిలించినట్టుగా వుంటాయి. అతను ఏదో చెబుతూ చప్పున తన మొహంలోకి చూశాడేమిటి?

కమల చప్పున కళ్లు వాల్చుకుంది. ఛీ అత నేమనుకుంటాడు? దొంగతనంగా చూస్తున్నానని అనుకుంటాడేమో! కమల కొద్దిగా కళ్లెత్తి అతనివైపు చూసింది. నిన్ను నేను కనిపెట్టాలే అన్నట్టు నవ్వాడతను. కమల చెంపలు ఎర్రబడినాయి.

పోనీ తను కూడా ఇంటికి వెళ్ళేవరకూ అతనివైపు చూడకుండా ఈ పుస్తకాలు చదివితే సరి. పత్రిక తీసుకుని కథ చదవటంలో మునిగిపోయింది.

అందులో కథానాయకుడు ఉష అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. ఎంతో అన్యోన్యంగా సాగుతోంది వారి దాంపత్యం. హఠాత్తుగా ఒకరోజు అర్జెంటు పనిమీద వూరువెళ్ళి ఇంటిదగ్గర ఉష ఒక్కతే వుండలేదని అతను తిరిగి ప్రయాణమైనాడు. అతను గుమ్మంలో తలుపుకు ఆనుకుని నిలబడి పరధ్యానంగా చూస్తూ చప్పున కాలు జారిపడి రైలుక్రింద ప్రాణాలు కోల్పోతాడు.

కమల చప్పున చదవటం ఆపేసింది. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. మైగాడ్! అతను కూడా ఎప్పుడూ తలుపు పక్కనే నిలబడతాడు. అతను కూడా........అమ్మో! ఇంకేమైనా వుందా?

కమల దడదడ లాడుతున్న గుండెలతో అతని వైపు చూసింది. అతనింకా చేతులు కట్టుకుని అక్కడే నిలబడి ఏమిటో మాట్లాడుతున్నాడు. అతను కూడా ఏమరుపాటుగా కాలు జారి....కమల చప్పున చేయిచాచి మరచెంబులో నీళ్ళు గ్లాసులోకి వంచుతున్న జ్యోతి చేతిలోంచి గ్లాసు లాక్కుని గడగడా తాగేసింది.

"అదేంటక్కా నువ్వు తాగేశావు? ఈ నీళ్లు బావగారి కివ్వాలనుకుంటే" జ్యోతి బుంగమూతితో చిరుకోపంగా అంది. అందరి చూపులూ కమలవైపు తిరిగాయి.

అతను నవ్వుతూ "ఫరవాలేదులే జ్యోతీ నాకు మళ్ళీ ఇవ్వు" అన్నాడు.

నుదుటిమీద అలుముకున్న చెమటను అద్దుకుంటుంటే 'ఏమిటలా వున్నావు' అన్నట్టు అతను ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా చూశాడు.

కమల ఏమీ లేదన్నట్టు తలూపింది. ఐనా గుబులు తీరలేదు. వదినను పిలిచి "వదినా...." అంటూ వివరంగా చెప్పింది.

సరళ నవ్వుతూ "అమ్మో! మీ శ్రీవారి గురించి అప్పుడే నీకెంత బెంగ? అయితే రేపు జీవితంలో అతన్ని వెయ్యి కళ్ళతో చూస్తూ గుప్తధనంలా కాపాడుకుంటావన్న మాట" అంది కొంటెగా.

కమల మొహం ఎర్రబడింది. సరళ జ్యోతి చెవిలో ఏదో చెప్పి పంపించింది. జ్యోతి వెళ్ళి అతనితో ఇటే చూపిస్తూ ఏదో చెబుతోంది. అతను జ్యోతి దగ్గరగా వంగి వింటూ నవ్వుతున్నాడు. తన ఆదుర్దా చూసి నవ్వుకుంటున్నాడేమో.

అతను ఏం చెప్పాడో ఏమో జ్యోతి తిరిగి వచ్చి,


"అక్కా! బావగారికి అలా అలవాటేట. నాకేం ఫరవాలేదు మీ అక్కను భయపడ వద్దని చెప్పు అన్నారు" అంది.

అయినా కమల స్థిమితంగా కూర్చోలేకపోతోంది. మైగాడ్! ఒకవేళ ఖర్మకాలి ఏదయినా జరిగితే, అసలే ఈ వెధవ రైలు అక్కడేదో కొంపలంటుకు పోతున్నట్టు పరుగులు తీస్తోంది.

అందరూ ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు. ఎవ్వరూ అతన్ని కూర్చోమనరేం? అత్తగారికి మాత్రం మతి లేకుండా ఆ వెధవ కబుర్లు చెబుతూ, చుట్టరికాలు తిరగెయ్యకపోతే ఒక్కసారి కొడుకుని హెచ్చరించడేం? అతనేమో మహావీరుడిలా నాకలవాటేలే అని చెప్పాడు. "మీరు కూర్చోండి" అని తను చెప్తే? అమ్మో ఇంకా నయం! నిన్న పెళ్ళయిందో లేదో ఈ కోడలు పిల్లకి అప్పుడే అధికారం వచ్చిందా







అని అందరూ అనరూ!

ఏం చెయ్యాలో కమలకు దిక్కుతోచటం లేదు. అతను సీరియస్‌గా చెబుతున్న మాటలు మంద్రస్థాయిలో మధ్య మధ్య ఆ ఆడవాళ్ళ గొడవల్లోంచి కమల చెవుల్లో దూరుతూనే వున్నాయి. అతనేం చెప్తున్నాడో వినాలనుంది కానీ, మనసంతా అతనలా గుమ్మంలో నిలబడకుండా ఎక్కడయినా కూర్చోమని ఎలా చెప్పాలా అని తన్నుకులాడుతోంది.

రైలు కుదుపుకి అతను ముందుకు వాలబోయి కుడిచేత్తో కమ్మీని పట్టుకుని నిలదొక్కుకోవటం కమల కంటపడింది.

ఈ రైలు ప్రయాణం సక్రమంగా సాగుతుందో లేదో? ఈ వెధవ రైలు చప్పున గమ్యస్థానం చేరగూడదూ? కనీసం నెమ్మదిగానయినా పోవచ్చుగా! అతను అసలిదేమీ పట్టించుకోవటం లేదు. రేపు కాపరానికొచ్చాక అతనికి ఇటువంటి విషయాల్లో గట్టిగా వార్నింగ్ ఇవ్వాలి. కానీ ఈలోగా ప్రయాణంలోనే ఏదయినా జరగరానిది జరిగితే! కమల వీపుమీద భయంలాంటిది జర్రున పాకింది.

పెళ్ళయి ఇరవైనాలుగు గంటలు కాలేదు. తన మనసు అప్పుడే ఇన్ని శంకలతో నిండిపోయిందేమిటి? "ఓరి భగవంతుడా! అతనికేం కాకుండా కాపాడు తండ్రీ! కొబ్బరికాయ కొడ్తాను" మనసులోనే మొక్కుకుంది.

కమల గుండె ఇలా భయంతో కొట్టుకుంటుండగానే రైలు స్టేషన్‌లు మారిపోతూ సాగుతోంది. ఉన్నట్టుండి ఒక్క కుదుపుతో ఆగిపోయిన బండిలో కమల ఉలిక్కిపడి తేరుకుని చూసింది. అప్పటికే వీళ్ళు చేరాల్సిన ఊరు వచ్చేసింది. అతను సామాను దింపిస్తున్నాడు.

కమల తేలిక పడిన మనసుతో దేవుడికి మనసులోనే నమస్కరించి క్రిందికి దిగింది.

సామానంతా టాక్సీలో వేయించటం అందరూ రిక్షాలు ఎక్కటం జరిగిపోయింది. చివరగా ఆనంద్ రిక్షాలో కమలను కూర్చోమని తనూ కూర్చున్నాడు. అప్పుడే రైలు కూతవేసి బయలుదేరింది.

పక్కన ఎవరూ లేకపోవటంతో అతను ధైర్యంగా "నాకేమయినా అవుతుందని భయపడ్డావా?" అన్నాడు.

కమల చప్పున అవునన్నట్టు తలూపింది.

"నాకది అలవాటే" నవ్వుతూ అన్నాడతను.

"ఏమో నేను ఎన్నోసార్లు రైలు ప్రయాణం చేశాను. కానీ ఈసారిలా ఎన్నడూ బాధపడటం, భయపడటం జరగలేదు" నెమ్మదిగా, మృదువుగా ఎంతో రిలీఫ్‌గా అంది కమల. □